క్లుప్తంగా

'కంటి వెలుగు' కేంద్రం పరిశీలన



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుష్బూగుప్తా

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని సెయింట్‌జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూగుప్తా శనివారం పరిశీలించారు. ఏర్పాట్లు బాగా ఉన్నాయని, ఇదే తరహాలో పూర్తి స్థాయిలో దగ్గరి, దూరం చూపు తక్కువ కలిగిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లకు సూచనలు చేశారు. ఎక్కువ శాతం మంది అద్దాలు తీసుకువెళ్తున్నారని, కంటి సమస్యలు ఉన్నవారిని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మిర్యాలగూడ : ఫిబ్రవరి 10వ తేదీ వరకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎండీ. అయాజ్ అలీఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష హాల్ టికెట్స్ ఏప్రిల్ 8 నుంచి 15వ తేదీ వరకు సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 16న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 6వ తరగతికి, అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన క్లస్టర్ లెవెల్ క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ

మిర్యాలగూడ : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ జిల్లా సహకారంతో అభినయ మహిళ మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన విజేతలకు జెడ్పీటీసీ పుల్లెంల సైదులు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, రేణుక, అభినయ మహిళ మండల అధ్యక్షురాలు వెన్న సుచరిత, కొండ నాయక్, చందు, సూర్యనారాయణ, శేఖర్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గట్టు పీర్ల ఉత్సవాలు ప్రారంభం

చింతపల్లి : మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ గుట్టపై కొలువుదీరిన గట్టు పీర్ల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీర్ల దర్గాను భక్తులు దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

రేషన్ దుకాణాలు సకాలంలో తెరవాలి

డిండి : ప్రభుత్వం సూచించిన నిర్ణీత సమయాల్లో రేషన్ దుకాణాలను తప్పని సరిగా తెరిచి ఉంచాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ నిర్వాహకులకు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గోనకొల్ గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు ముఖ్యఅతిథులుగా భావించి గౌరవించాలన్నారు. రేషన్ షాపుల్లో సంబంధిత బోర్డు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన అందుగుల ప్రవళిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఆమె నిరుపేద దళిత కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విద్యార్థిని తండ్రి వెంకటయ్యకు శనివారం రూ.50వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య దంపతులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి కూడా ఉన్నారు.

మురుగు నీటితో సహవాసం

- ఇళ్ల మధ్య నిలిచిన డ్రెయినేజీ నీరు
- పొలంలోకి వెళ్తుందని అడ్డుకట్ట వేసిన రైతు
- పదిహేను రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు





బీకేపాడ్‌లో ఇళ్ల వద్ద నిలిచిన మురుగు

నిడమనూరు : మండలంలోని బొక్కమంతులపాడ్‌లోని ఐదో వార్డు ప్రజలు మురుగు నీటితో సహవాసం చేస్తున్నారు. డ్రెయినేజీ మురుగునీరు ముందుకు వెళ్లకుండా ఇళ్ల మధ్య చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదిహేను రోజులుగా ఈ సమస్యతో సతమవుతున్నారు.

అడ్డుకట్ట వేయడంతో..

మురుగుకాల్వ చివరి భాగంలో నీరు రైతు పొలంలోకి వెళ్తున్నాయని, వెళ్లకుండా అడ్డుకట్ట వేశాడు. దీంతో మురుగు డ్రెయినేజీల నుంచి పొంగి పార్లుతుంది. ఇలా బయటకు వచ్చిన నీరు ఇళ్ల మధ్య చేరి నిల్వ ఉంటుంది. దీంతో నీరు దోమలకు, ఈగలకు అవాసాలుగా తయారయ్యాయి. అలాగే మురుగు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఏ రోగాలు వస్తాయోనని వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పదిహేను రోజులవుతున్నా సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలం చెందారు. ఇదిలా ఉంటే సర్పంచ్ పిల్లి రమేశ్‌ను ఈ విషయంపై వివరణ అడగగా గతంలో నీరు వెళ్లేదని, కానీ కొత్తగా రోడ్డు వేయడం, నూతనం పైప్‌లైన్ కల్వర్టు నిర్మాణం చేసిన తర్వాత దానిని బంద్ చేయడంతో ఈ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. రైతు తన పొలంలోకి మురుగు నీరు వెళ్లడం తమకు ఇబ్బంది ఉందని అభ్యంతరం పెడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా కుటుంబాల వారు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి



మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీరు నిలిచి ఇంటి చుట్టూ దుర్వాసన వస్తుంది. పదిహేను రోజులవుతున్నా సమస్యను పరిష్కరించకపోవడం తీవ్ర ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- కురపాటి రాజు, బీకే పాడ్

దుర్వాసనతో ఇబ్బంది



ఇంటి చుట్టూ మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ఇంటిలో ఉండలేక పోతున్నాం. ఇన్నాళ్లు లేని సమస్య ఇప్పుడే ఎందుకు వచ్చిందో అధికారులు చెప్పాలి. అధికారులు వెంటనే సమస్యను పరిస్కరించాలి.

- ముత్తరాజు ముత్తమ్మ, బీకేపాడ్

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం 'మనఊరు–మనప్రభుత్వం–మన పథకాలు' కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండల పరిధిలోని జర్పులతండాలో రూ.25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, ఎంపీడీఓ శర్మ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, శిరందాసు కృష్ణయ్య, టీవీఎస్ రెడ్డి, సర్పంచ్ జర్పుల సర్యానాయక్, కోటేష్, జైహింద్‌రెడ్డి, ఇద్దయ్య, పరమేశ్, బొడ్డుపల్లి కృష్ణ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు

చింతపల్లి : మండల పరిధిలోని గొడుకొండ్ల గ్రామ పంచాయతీ మాల్ వెంకటేశ్వరనగర్‌లో మురుగు కాల్వల నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం మాల్ పట్టణంలోని డ్రెయినేజీ ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన షాప్ యజమానులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు, గ్రామస్తులు డ్రెయినేజీ నిర్మాణం చేపడతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, మాస భాస్కర్, మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపడి కిష్టారెడ్డి, పులిరాజు, జగన్, నర్సింహా, పరమేశ్, యాదయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటో గ్రాఫర్లు

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తితో పాటు వివిధ ప్రమాదాల్లో గాయపడిన తోటి మిత్రులకు ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బంటు అరుణ్‌కుమార్ కుటుంబానికి రూ. 25వేలు, ప్రమాదంలో గాయపడిన సపావత్ మనీష్‌కు రూ.25వేలు, యాకుబ్‌కు రూ. 15వేలను అందజేశారు. అదే విధంగా ఈ ఆర్థిక సాయం రాష్ట్ర యూనియన్ కుటుంబ భరోసా పథకం కింద రూ.20 వేలు, లోకల్ ఫొటోగ్రాఫర్ల యూనియన్ తరుపున రూ.45వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె వెంకన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి పందిరి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి ఎలియాస్, వసంతాచారి, రాజశేఖర్, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, నాగరాజు, నాగార్జున, నాగరాజు, సాయి, సైదా రాజు, సైదులు, మనోహర్, సంతోష్, నరేష్, నాగరాజు, శేఖర్, నాగేష్, జాను, యశ్వంత్‌లతో పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలని వినతి

మిర్యాలగూడ : డివిజన్ వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్న బియ్యం సరఫరా చేసి బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, అంగన్‌వాడీ టీచర్లకు రావాల్సిన టీఏ, డీఏలను తక్షణమే చెల్లించాలని, గ్యాస్, భోజన బిల్లులను సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్ర సైదానాయక్, జగన్ నాయక్, వదుద్, వీరన్న, ఆకాశ్, ఉపేందర్, సమాద్, కోటేష్, అరవింద్, సంతోష్, తరుణ్, హనుమంతు, స్వామి పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సుందర్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి



కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని సుందర్‌నగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సీపీఎం బృందం సమస్యలు తెలుసుకోవడానికి ఆ నగర్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అక్కడి ప్రజల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, ప్రతి రోజూ మంచినీరు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. శివారు కాలనీల్లో వీధిలైట్లు వెలిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దాతల సహకారంతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలోని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. అనంతరం కాలనీవాసులు సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లు గౌతంరెడ్డి, ఐద్వా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రెమడాల పరశురాములు, మాజీ కౌన్సిలర్ చెనగాని యాదగిరి, బిక్షం, రాములు, మల్లయ్య, రాజు, వెంకటయ్య, అంజయ్య పాల్గొన్నారు.

'సేవాలాల్ గుడి జోలికి వస్తే సహించేది లేదు'

డిండి : మండల కేంద్రంలోని బంజారాల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ గుడి జోలికి వస్తే సహించేది లేదని బంజారా సంఘం మండలాధ్యక్షురాలు రాత్లావత్ మాణిక్యమ్మ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని సేవాలాల్ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కొంతమంది స్వార్థపరులు గుడి స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. గతంలో సేవాలాల్ గుడి వద్ద ఉన్న జెండాలను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారన్నారు. మండల కేంద్రంలో సేవాలాల్ గుడి ఉండకూడదని కొంత మంది వ్యక్తులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదన్నారు. ప్రతిఏటా గుడి వద్ద సేవాలాల్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం సభ్యులు లక్పతినాయక్, తిర్పతినాయక్, భీముడు నాయక్, శంకర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, బాలాజీనాయక్, నారాయణసింగ్, మోతీలాల్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు



మాట్లాడుతున్న బీల్యానాయక్

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల కమిటీల నియామకాల్లో ఏకపక్షంగా వ్యవహరించడం ఏమాత్రం సరికాదని కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ సభ్యుడు కేతావత్ బీల్యానాయక్ అన్నారు. శనివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా మండలాలకు సంబంధించి స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మండల కమిటీ నియామకాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ ముఖ్య నాయకులకు సమాచారం లేకుండా కమిటీలు ఏర్పాటు చేస్తుండడంతో కార్యకర్తల్లో అసంతృప్తి ఏర్పడుతుందని, తద్వారా పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి మండలాలకు సంబంధించిన నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మద్దిమడుగు నెల్సన్ , హరిలాల్‌నాయక్, కిరణ్‌నాయక్, జైపాల్ నాయక్, నాగార్జున, తదితురులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అరుణకుమారి

మిర్యాలగూడ టౌన్ : 2023–2024 విద్యా సంవత్సరానికి గాను మిర్యాలగూడ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి కోరారు. శనివారం పట్టణంలోని జ్యోతి ఆస్పత్రి సమీపంలోని పాఠశాలలో మిర్యాలగూడ, త్రిపురారం, వేములపల్లి మండలాలకు చెందిన ముస్లిం,మైనార్టీ పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గురుకుల పాఠశాల, కళాశాలలో 5, 6, 7, 8, 9వ తరగతితో పాటు ఇంటర్మీడియేట్‌లో ముస్లిం, మైనార్టీ విద్యార్థులు చేరేందుకు ఈనెల చివరి వరకు అవకాశం ఉందన్నారు. 5వ తరగతిలో నూతనంగా 80 సీట్లు ఖాళీలుండగా 6, 7, 8, 9వ తరగతులకు చెందిన బ్యాక్‌లాగ్ ఖాళీలు 35 ఉన్నాయని, ఇంటర్మీడియేట్‌లో ఎంపీసీ 40, బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఖాళీలు ఉన్నందున ముస్లీం మైనార్టీలు కూడా విద్యార్థులను ప్రొత్సహించడంతో పాటు ప్రతి ఒక్కరూ సారించాలని కోరారు. ఈ అవకాశాన్ని ముస్లిం, మైనార్టీ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యాఅభివృద్ధి బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో పాఠశాల కో ఆర్డినేటర్ నూర్జాహాన్, కళాశాల కో ఆర్డినేటర్ పద్మ, ప్రముఖ ముస్లీం మైనార్టీలు మౌలానావలీయుల్లా, మౌలానా మగ్దుం, అహ్మద్ చావూస్, ముఫ్తీ ఇమ్రాన్, అబ్దుల్ అల్లామ్, ఫాహిమ్, హబీబ్, ఇలియాస్, ఇమామ్, ఆజీమ్, మౌలానా కలీమోద్దీన్‌లతో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కొత్తపల్లి హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి



పెద్దవూర : మాట్లాడుతున్న సర్పంచ్ లలితావెంకట్‌రెడ్డి

హాలియా : ఆడ పిల్లల పరిరక్షణ ప్రతి ఒక్క తల్లిదండ్రుల బాధ్యత అని కొత్తపల్లి సర్పంచ్ బూడిద స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొత్తపల్లి హైస్కూల్‌లో బాలికలకు నిర్వహించిన 'భేటీ బచావో..భేటీ పడావో' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 2011 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో బాలికల శాతం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ రమణారెడ్డి, భిక్షం, కానిస్టేబుల్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రియాజ్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, కుర్మారెడ్డి, హేమలత, సూర్యకాంతం, జ్యోతి, వాణి, అంగన్‌వాడీ టీచర్లు వజ్రమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ : జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాలను శనివారం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి రజిని బాల్య వివాహాలు, అక్రమ దత్తత, బ్రూణ హత్యలు, బాలికల అక్రమ రవాణా వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికల హక్కుల గురించి మాట్లాడిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నర్సింహా, ఉపాధ్యాయులు శ్రీలత, వినోద, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, మరియమ్మ పాల్గొన్నారు.

పెద్దవూర : 18ఏళ్లు నిండని బాలికలకు వివాహం చేయడం నేరమని, దీంతో మహిళల్లో ఎదుగుదల లోపించి అనార్థాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చలకుర్తి సర్పంచ్ తుమ్మలపల్లి లలితావెంకట్‌రెడ్డి అన్నారు. స్వరక్ష డే సందర్భంగా శనివారం మండలంలోని చలకుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌస్యబేగం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జార్జ్, ఉపాధ్యాయులు లక్ష్మీప్రభ, శాంత, రేణు, ఉప, సైదానాయక్, నారాయణరెడ్డి, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని గర్నెకుంట ప్రాథమిక పాఠశాలలో శనివారం 'భేటీ బచావో భేటీ పడావో' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హాల్య పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ పుష్ప పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని మిట్టగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మేరావత్ సామ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు ఉమాదేవి, జ్యోతి పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడలేదు

- తడకమళ్ల సర్పంచ్ వేమారెడ్డి

మిర్యాలగూడ : మండలంలోని తడకమళ్ల గ్రామంలో 33గుంటల భూమిని కబ్జా చేసినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని ఆ గ్రామ సర్పంచ్ దేవిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసత్య ఆరోపసణలతో వార్డు సభ్యురాలు ఎలగందుల సుజాత, ఎలగందుల ఆంజనేయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి వద్ద ఆధారాలు ఉంటే గ్రామస్తులందరి ముందు బయటపెట్టాలన్నారు. అసత్య ఆరోపణలతో అప్రతిష్టపాలు చేయడానికి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 33 గుంటల భూమిని 40ఏళ్ల కిందట అప్పటి సర్పంచ్ దివంగల గట్టికొప్పుల రాంరెడ్డి కొన్నట్లు దస్తావేజులు ఉన్నాయని తెలిపారు. గ్రామ కంఠం కోసం కేటాయించిన భూమిని కుల సంఘాలకు కేటాయించాలని అప్పటి సర్పంచ్ గట్టికొప్పుల రాంరెడ్డి నిర్ణయించారని దీనిలో భాగంగా కుమ్మరి సంఘానికి కొంత మేర కేటయించినట్లు తెలిపారు. మిగిలిన స్థలంలో ఆ సంఘం అధ్యక్షుడిగా ఉన్న వార్డు సభ్యురాలు ఎలగందుల సుజాత భర్త ఆ భూమిని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతుండగా పెద్దలు న్యాయం తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ ఇంటి నిర్మాణం నిలిపివేయాలని పంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతో తనపై కక్షతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఆధారాలు ఉంటే చర్చకు రావాలని కోరారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ గౌసు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణకు రానున్న ఎన్నికల్లో పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాహుల్, ప్రియాంకా గాంధీ సేన ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో నిర్వహించిన సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు సమావేశం హాజరుకావడంతో కార్యకర్తలకు మంచి శుభపరిణామన్నారు. ఈ సమావేశంలో ఆ సేన నాయకులు షేక్ అబ్దుల్లా, ఇమ్రాన్, అజయ్, గఫార్, సికిందర్, రామకృష్ణ, బక్కయ్య, జావిద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం కేఎల్ఎన్ బాలిలక జూనియర్ కళాశాల, ఎస్‌పీఆర్ స్కూల్‌లో 'దేశాభివృద్ధిలో ప్రధాన మంత్రి పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎస్‌పీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ నిలిమా, యామిని వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివా స్‌రావులు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రతన్‌సింగ్‌నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సరిత, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్యాం, గిరి, కళాశాల కరస్పాండెంట్ హన్మంతరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ అభి, ఏబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ : సీఐటీయూ అనుబంధ సంఘమైన దామరచర్ల గంగాభవాని మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతలచెరువు పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా పగిడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా రాంపల్లిలతోపాటు మరికొందరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వం హమాలీ కార్మికులకు కనీస వేతనం, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, పని భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పగిడి సైదయ్య, కుర్ర శ్రీను, జానపాటి ముక్కంటి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు అందించాలి



వేములపల్లిలో వరిచేలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో వేసిన వరినాట్లలో కలుపు తీసే దశలో తాటాకు తెగులు, పచ్చ పురుగు రావడంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారని వ్యవసాయాధికారులు స్పందించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. శనివారం వేములపల్లి మండలంలో ఆయకట్టు ప్రాంతంలో వేసిన వరినాట్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. వరిపంటకు తెగుళ్లు రావడంతో పెరుగుదల ఆగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నప్పటికీ వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారుల, శాస్త్రవేత్తలు స్పందించి సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు రైతాంగానికి సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీను, బొంగర్ల వెంకటయ్య, కోడిరెక్క వెంకటయ్య, కోడిరెక్క వెంకన్న, విష్ణు, వెంకన్న పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ ఫొటో పెట్టాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటంతో పాటు రాజ్యాంగ ప్రతిమను తప్పనిసరిగా పెట్టాలని ఆలిండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్ర వెంకన్న అన్నారు. శనివారం ఆలిండియా సమతా సైనిక్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏకుల సురేష్ ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయజెండా ఎగురవేసే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు ప్రతి ప్రాంతంలో డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్, రాజ్యాంగ ప్రతిమను ఉండే విధంగా ఆదేశాలివ్వాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం జిల్లా సలహాదారులు డా.ఏకుల రాజారావు, కంబాలపల్లి వెంకటయ్య, మేడ సైదులు, ఆడెపు సతీష్, చేపూరి రాజేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.